# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 16 | గురువారం | 13-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:16 | Thursday | 13-8-2026 | Pages:08 | Cost:2/- |







## హార్మూజ్ జలసంధి మా అదుపులోనే ఉంది


- హార్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ సాధించామన్న ట్రంప్
- జలసంధిలో 'వాల్ ఆఫ్ స్టీల్' ఏర్పాటు చేశామని వెల్లడి
- ఇరాన్‌కు నేవీ, ఎయిర్‌ఫోర్స్ లేవంటూ తీవ్ర వ్యాఖ్యలు



పశ్చిమాసియాలో వ్యూహాత్మకమైన హార్మూజ్ జలసంధిపై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉందని, దానిని తమ ఆధీనంలోనే ఉంచుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని 'వాల్ ఆఫ్ స్టీల్' (ఉక్కు గోడ)గా అభివర్ణించిన ట్రంప్, దీనిని ఇరాన్ ప్రతిఘటించలేదని పేర్కొన్నారు. ఇరాన్ వద్ద సమర్థవంతమైన నావికాదళం కానీ, వైమానిక దళం

- మిగతా 2వ పేజీలో

## రీల్స్ యుగంలో షార్ట్‌కట్లు వద్దు!




**ప్రధాని మోదీ వ్యాఖ్య**

**మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ**

న్యూఢిల్లీ: యువత తాము ఆదర్శంగా తీసుకునే వ్యక్తుల ఆత్మకథలు చదవాలని, తద్వారా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల ప్రభావంతో పక్కదారి పట్టకుండా ఉండవచ్చునని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పరోక్షంగా వ్యాఖ్యానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ "ట్రైంఫ్ ఆఫ్ ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్"పేరుతో రాసిన ఆత్మకథను ప్రధాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ రీల్స్ యుగం'లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు మిమ్మల్ని కొన్ని దారుల్లోకి మళ్లించవచ్చు. ఓడించవచ్చు. షార్ట్‌కట్‌ల కాలంలో రైల్వేస్టేషన్లలో

- మిగతా 2వ పేజీలో

## గతంలోనూ బాగా పోరాడాం..
## ఇప్పుడు కూడా అదే రీతిలో ప్రశ్నించాలి




- అందుకే ఏకైక ప్రతిపక్షమైనా ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు
- అలా గుర్తిస్తే సభలో మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాల్సి వస్తుంది
- ఆ హక్కు ఇవ్వడం ఇష్టం లేకనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు
- మండలిలో మనకు మంచి సంఖ్యా బలం ఉన్నందున గట్టిగా గొంతెత్తాలి




## మొండి బకాయిదారులకు భవిష్యత్తులో
## ధాన్యం కేటాయించొద్దు

- ధాన్యం డబ్బు బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఉద్దేశపూర్వకంగా ఎగవేసేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు
- బకాయిల వసూలుకు విధివిధానాలు రూపొందించాలి
- ఆ ధాన్యాన్ని మహిళా సంఘాలకు అప్పగించే అంశం పరిశీలించాలి
- ధాన్యం నిల్వకు పైలట్ ప్రాజెక్టుగా ఐదు జిల్లాల్లో సైలో బ్యాగులు
- ప్రైవేటు గోదాములు, కల్యాణ మండపాలు, పాత థియేటర్లను కూడా గుర్తించండి
- పౌరసరఫరాల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

హైదరాబాద్: వ్యాపార దృక్పథంతో ధాన్యం మిల్లులు నిర్వహించే వారితో ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. కానీ ఉద్దేశపూర్వకంగా బకాయిలు ఎగవేసేందుకు ప్రయత్నించే వారి విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం సొమ్ముకు సంబంధించిన బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం స్పష్ట మైన విధివిధానాలను రూపొందించాలని

- మిగతా 2వ పేజీలో

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు




- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి
- మేం టీ-హబ్ కడితే.. రేవంత్ 'అనుముల హబ్స్' తెస్తున్నారని ఎద్దేవా
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి



## అమరావతి ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి పవన్‌ను ఆహ్వానించిన మంత్రి నారాయణ

**సీడ్ యాక్సెస్ రోడ్డు, వంతెనల ప్రారంభోత్సవంలో పాల్గొననున్న పవన్**

**విశాఖలో ప్రపంచ ఏనుగుల దినోత్సవ వేడుకలకు హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి**

**ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ కూడా రాక**

రాజధాని అమరావతిలో త్వరలో ప్రారంభం కానున్న పలు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి హాజరుకావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. బుధవారం పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన మంత్రి, రాజధానిలో పూర్తి కావచ్చిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని ఆయనకు వివరించారు. అమరావతిలో నిర్మాణం పూర్తి చేసుకున్న సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు, రెండు స్టీల్ బ్రిడ్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మించిన గృహ సముదాయాలను

- మిగతా 2వ పేజీలో

## నేరాల రూపం మారింది..
## పోలీసింగ్ మారాలి

- పోలీసులతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్
- నేర దర్యాప్తులో 'గోల్డెన్ అవర్' కీలకమని, ఆధారాల పరిరక్షణలో విఫలం కావొద్దని సూచన
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశం
- ఇక నుంచి ప్రతీ నెలా పోలీసుల పనితీరుపై పెర్ఫార్మెన్స్ రిపోర్టు విడుదల
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ

మారుతున్న కాలంతో పాటు నేరాల స్వరూపం, స్వభావం పూర్తిగా మారిపోయాయని, అందుకు అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేరం జరిగిన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో కీలక ఆధారాలు చేజారిపోకుండా చూడటమే నేర నియంత్రణలో మొదటి విజయమని ఆయన పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.



బుధవారం నాడు సచివాలయం నుంచి రాష్ట్ర డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,650 మంది అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ స్థాయివరకు ఒకేసారి ముఖ్యమంత్రి సమావేశం

- మిగతా 2వ పేజీలో




## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు
- ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన
- ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు

# రాజ్యసభను కుదిపేసిన “లుంగీవాలా” వివాదం

రాజ్యసభలో బుధవారం ‘లుంగీవాలా’ వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే ‘లుంగీవాలా’ అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు. ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి

## అమరావతి ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి పవన్‌ను ఆహ్వానించిన మంత్రి నారాయణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించాల్సిందిగా ఉప ముఖ్యమంత్రిని నారాయణ కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సీడ్ యాక్సెస్ రోడ్డు అమరావతి అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మరోవైపు, విశాఖపట్నంలో రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ‘ప్రపంచ ఏనుగుల దినోత్సవ’ వేడుకలకు సైతం ఉప ముఖ్యమంత్రి హాజరుకానున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కూడా ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని ఆయన వెల్లడించారు. రాజధాని అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

## రీల్స్ యుగంలో షార్ట్‌కట్లు వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శించే ఓ సందేశాన్ని గుర్తు చేసుకుందాం. ‘ఏ షార్ట్‌కట్ విల్ కట్ యూ షార్ట్’(దగ్గరి దారిలో వెళ్లాలనుకుంటే మీరు ఖతమైపోతారన్న అర్థం) అని ఎందుకు రాస్తారంటే కొంతమందికి రైల్వే బ్రిడ్జీలు ఎక్కి అవతలకు వెళ్లడం కాకుండా.. పట్టాలపై దూకి వెళ్లే అలవాటు ఉంటుంది. అయితే జీవితంలో ముందుకెళ్లేందుకు ఒక షార్ట్‌కట్ ఉందంటే అది మీరు ఆదర్శంగా తీసుకునే వ్యక్తుల ఆత్మకథలు చదవడం”అని వ్యాఖ్యానించారు. ఆత్మకథలు ఆయా కాలాల పరిస్థితులను వారి జీవితానుభవాల దృష్టిలోంచి ఆవిష్కరిస్తాయి కాబట్టి యువత తాము ఆదర్శంగా భావించే నేతలు, వ్యక్తుల ఆత్మకథలు చదవడం అలవాటు చేసుకోవాలని కోరారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కృత నిశ్చయంతో ఒక వ్యక్తి ఎలా అత్యున్నత రాజ్యాంగ పదవి పొందవచ్చు తెలుసుకునేందుకు రామ్‌నాథ్ కోవింద్ ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. పదవీ విరమణ తరువాత కూడా కోవింద్ “వన్ నేషన్, వన్ ఎలక్షన్”విషయంపై పనిచేస్తూ తన ప్రజా జీవితాన్ని కొనసాగిస్తూండటాన్ని ప్రధాని కొనియాడారు. ఈ జమిలీ ఎన్నికలు దేశ ప్రజాస్వామ్య చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టే అవకాశముందన్నారు. కోవింద్ ఆత్మకథ నుంచి నవతరం నేర్చుకోవాల్సింది చాలా ఉందని ప్రధాని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మంది యువకులు కోవింద్‌లా ఎదగాలని ఆకాంక్షించారు. పల్లెటూరి వాడిని: కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ “కాన్పూర్ సమీపంలోని గ్రామీణ ప్రాంతపు పల్లెటూరి వాడిని నేను. గ్రామస్తుల నుంచే సహానుభూతి, ప్రేమలను నేర్చుకున్నా”అని తెలిపారు. చిన్నప్పుడు వర్షాలొస్తే ఇల్లు మొత్తం కారిపోయేదని, వర్షం ఎప్పుడు ఆగుతుందా అని ఎదురు చూసే వారమని తన కష్టాలను గుర్తు చేసుకున్నారు.

## హార్మూజ్ జలసంధి మా అదుపులోనే ఉంది: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

కానీ లేవని ఆయన ఎద్దేవా చేశారు. ఆ దేశ సైనికులకు కనీసం వేతనాలు కూడా అందడం లేదని, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ బలహీనపడి వెనకడుగు వేస్తోందని ఆరోపించారు. ఇరాన్ ఆర్థికంగా కుదేలైందని, నిధుల కొరతతో పాటు 300 శాతం ద్రవ్యోల్బణంతో ఆ దేశం సతమతమవుతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. “ఇరాన్ కేవలం మాటలకే పరిమితం, చేతలు శూన్యం. పశ్చిమాసియాలో ఆ దేశ ఆధిపత్యం ముగిసింది” అని ఆయన స్పష్టం చేశారు. తన పోస్ట్‌ను “ప్రైజ్ బీ టు అల్లా!” (దేవుడికి స్తోత్రం) అంటూ ముగించడం గమనార్హం. అయితే, ట్రంప్ తన వాదనలకు మద్దతుగా ఎటువంటి కార్యాచరణ వివరాలను లేదా ఆధారాలను వెల్లడించలేదు. ఈ దిగ్బంధనం ఎంతకాలం కొనసాగుతుంది, దీనివల్ల నౌకల రవాణాకు ఏవైనా అంతరాయాలు కలిగాయా అనే అంశాలపై స్పష్టత లేదు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ నుంచి కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

# నేరాల రూపం మారింది.. పోలీసింగ్ మారాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీసుల కీర్తి దేశవ్యాప్తంగా మార్మోగాలని, అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం**

ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు అత్యంత కీలకమని చంద్రబాబు అన్నారు. “రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఒక గర్వకారణం. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా మీరంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీస్, విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి” అని ఆయన సూచించారు. 2019-24 మధ్య పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని రాష్ట్రానికి పెను సమస్యగా మార్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామని, వారి గౌరవం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 14,770 ప్రభుత్వ సీసీ కెమెరాలతో పాటు, ప్రైవేటు వ్యక్తుల కెమెరాలను కలిపి మొత్తం లక్ష కెమెరాలను నేర నియంత్రణ కోసం అనుసంధానించామని తెలిపారు. ఫేస్ రికగ్నిషన్, డీఎన్ఏ డిటెక్షన్ వంటి ఆధునిక టెక్నాలజీతో నేరాలను వేగంగా ఛేదిస్తున్నామని అన్నారు.

**వివేకా కేసులో అది కాస్ట్ లీ మిస్టేక్**

రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. “పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మోటార్ సైకిల్ విన్యాసాలు, విశాఖలో మూడు గంటల పాటు రోడ్లు దిగ్బంధించడం వంటివి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయి. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒకే పార్టీకి చెందిన వారు. ఏ పార్టీకి కూడా చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ లేదు” అని చంద్రబాబు హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలను చెరిపేసే ప్రయత్నం జరగడం పోలీసుల వైపు నుంచి జరిగిన అత్యంత ఖరీదైన తప్పిదం (కాస్ట్ లీ మిస్టేక్) అని అన్నారు. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించడంలో వైఫల్యం ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో ఈ ఘటనే నిదర్శనమని, నేరస్తుల పట్ల ఉదాసీనత వద్దని స్పష్టం చేశారు.

**ఇకపై నెలవారీ పెర్ఫార్మెన్స్ రిపోర్ట్**

శాంతిభద్రతల విషయంలో ఏపీని దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలపాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ఇకపై ప్రతీ నెలా పోలీసు శాఖ పనితీరుపై ఒక పెర్ఫార్మెన్స్ రిపోర్టును విడుదల చేయాలని ఆదేశించారు. దీని ద్వారా ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని, సక్సెస్ స్టోరీలను ప్రజలకు వివరించవచ్చని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావాలని, అదే సమయంలో సంఘ విద్రోహ శక్తులకు పోలీసులంటే భయం కలగాలని సూచించారు. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానం కొనసాగుతుందని, ‘డ్రగ్స్ వద్దు బ్రో’ వంటి ప్రచారాలతో గంజాయి, మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, ప్రమాదాల నివారణకు రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌ల ఆడిట్‌పై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డీజీ ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీస్ స్టేషన్ల నుంచి శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాల అధికారులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు.



## గతంలోనూ బాగా పోరాడాం.. ఇప్పుడు కూడా అదే రీతిలో ప్రశ్నించాలి

అమరావతి: రాష్ట్రంలో ప్రజా సమస్యలపై మరింత గట్టిగా పోరాడాలని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. ప్రజా సమస్యలు, ప్రజలకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సభలో బలంగా ప్రస్తావించాలని.. ముఖ్యంగా శాసన మండలిలో పార్టీకి బలం ఉన్నందున ప్రజా సమస్యలపై ప్రభుత్వం నుంచి సమాధానం రాబట్టేలా పోరాడాలని ఎమ్మెల్సీలకు దిశా నిర్దేశం చేశారు. గతంలోనూ పార్టీ ఎమ్మెల్సీలు ప్రజా సముస్యలపై పోరాటాలు చేశారని, ఆదే రీతిలో ప్రస్తుత సమావేశాలకు మరింత సన్నద్ధంగా ఉండాలన్నారు. శాసనసభలో వైఎస్సార్‌సీపీ గొంతు వినిపించకూడుదనే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా వ్యవహరిస్తోందంటూ ఎత్తిచూపారు. వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తిస్తే.. ప్రతిపక్ష నాయకుడికి సభలో మాట్లాడేందుకు నిర్ణీత సమయం, హక్కులు వస్తాయని, అందుకే ప్రభుత్వం ఆ హోదా ఇవ్వడానికి ఇష్టపడటం లేదన్నారు. “వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించక పోవడం వల్ల అసెంబ్లీలో పార్టీకి సమయం లభించే అవకాశం పరిమితంగా ఉంటుంది. అందుకే సాక్ష్యాధారాలతోసహా, బయట ప్రెస్‌మీట్ల ద్వారా సమాధానం చెబుదాం.. ఆ విధంగా ప్రజలకు ఒకవైపు మాత్రమే కాకుండా, ప్రతి అంశంలోనూ ‘నాణేనికి రెండో వైపు’ చూపించే ప్రయత్నం చేద్దాం” అని చెప్పారు. శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాల సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై మండలి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే.. “డీఎస్సీ--2025లో పేపర్ లీకేజీ, అంతులేని అక్రమాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తాం. అదే మన మొదటి ప్రాధాన్యం. అందుకే ఈ అంశాన్ని శాసనమండలిలో ప్రధానంగా లేవనెత్తాలి. డీఎస్సీ వ్యవహారంపై ఇప్పటికే 74 రోజులుగా దాదాపు 10 రకాల ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాం. డీఎస్సీలో అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి. ఇంకా ఈ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగాల్సిందే. డీఎస్సీ అక్రమాలకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను ఇప్పటికే ప్రజల ముందుంచాం.




## మేం ‘టీ-హబ్’ కడితే.. రేవంత్ ‘అనుముల హబ్’ కడుతున్నారు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి ‘అనుముల హబ్స్’ ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. “తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన ‘అనుముల హబ్స్’ సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని ‘శతాబ్దపు ఆవిష్కర్త’గా ప్రకటించాలి” అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ చైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు.

# మొండి బకాయిదారులకు భవిష్యత్తులో ధాన్యం కేటాయించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పౌరసరఫరాల శాఖపై మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభు త్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం కల్పించిందని, ఇప్పుడు ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల (మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం మాయం కావడానికి సంబంధించిన బకాయిలు) వసూళ్లలో కొంత పురోగతి సాధించామని, మిగిలిన మొత్తాన్ని కూడా పూర్తిగా రాబట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ మేరకు విధివిధానాలను రూపొందించిన తర్వాత నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని సూచించారు. ఉప సంఘం పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు ఇకపై ధాన్యం కేటాయించకుండా, ఆ మేరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు మిల్లింగ్ బాధ్యతను అప్పగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో



ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. భారీగా ధాన్యం వచ్చే నల్లగొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ (భారీ ప్లాస్టిక్ ట్యూబ్‌లు)ల ఏర్పాటును పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేసేందుకు ఒక్కో నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. సైలో బ్యాగ్ నిర్మాణాలపై రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం నిర్వహిస్తామని సీఎం చెప్పారు. వీబీజీ రామ్‌జీలో ప్లాట్‌ఫాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున విశాలమైన ఫ్లాట్‌ఫాంలు నిర్మించి, జర్మన్ టెంట్లలో ధాన్యం నిల్వ చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించారు.

**ప్రైవేటు గోదాముల గుర్తింపు**

ధాన్యం నిల్వకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపైనా సీఎం ఆరా తీశారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు. ధాన్యం నిల్వకు అనువైన కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను గుర్తించి అవసరమైనప్పుడు లీజుకు తీసుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి సీజన్‌లో చివరి నిమిషంలో గోదాముల కోసం పరుగులు పెట్టకుండా ముందుగానే నిల్వ సామర్థ్యాన్ని సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, దక్షిణ భారత రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తూడి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాజాపేటలో ఘనంగా అన్న ప్రసాద వితరణ

**అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అన్నదానం**

- **ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి**

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో అమావాస్య సందర్భంగా బుధవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దల జ్ఞాపకార్థం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి కైలాసపురం ఆలయ వ్యవస్థాపక అర్చక స్వామి డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ.. శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్న వారికి అన్నం అందించడం ద్వారా సమాజంలో మానవతా విలువలను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామిని చేనేత శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులు, స్థానికులు, ప్రజలకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పెద్దల జ్ఞాపకార్థం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పలువురు భక్తులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మార్త జగదీశ్వర్, బెజుగం నాగభూషణం, ఇమ్మడి నర్సింలు, నంగునూరు రాజు, ఇమ్మడి శ్రీనివాసులు, ఉప్పల శ్రీనివాసులు, బెజుగం శ్రీనివాసులు, గంగిశెట్టి రాజు, పులిగిల్ల శ్రీనివాసులు, నాళ్ల శేఖర్, పుల్లూరు శ్రీనివాసులు, బుడమ సత్యనారాయణ, సింగారం పెంటయ్య, బెలిదే ఉప్పలయ్య, బెజుగం లింగమూర్తి, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద చెరువుకు ఫీడర్ ఛానల్ నిర్మించాలి

- **ధర్మారెడ్డిపల్లి కాలువ నీటిని మళ్లించాలి**
- **వ్యవసాయ కార్మిక, మత్స్యకార సంఘాల నిరసన**



**తొలివెలుగు, రామన్నపేట :** ధర్మారెడ్డిపల్లి కాలువ ద్వారా రామన్నపేట పెద్ద చెరువుకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి కందుల హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం, ముదిరాజ్ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.300 కోట్ల నిధులతో చేపడుతున్న ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణం నుంచి కొమ్మాయిగూడెం మీదుగా రామన్నపేట పెద్ద చెరువుకు ఫీడర్ ఛానల్ ద్వారా నీటిని మళ్లించాలని కోరారు. కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులను విస్తృతం చేయడంతో పాటు రామన్నపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్టల మచ్చగిరి, బచ్చా రాములు, కందుల శ్రీశైలం, బచ్చా వెంకటేశం, రేపాక పోచమ్మ, కందుల లలిత, కేశబోయిన ఇంద్రమ్మ, లక్ష్మి, సత్తమ్మ, పద్మ, యాట అనసూయ, మంగమ్మ, సిద్ధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో 'మత్స్యగిరి' బాసట

- **ఐలయ్య కుటుంబానికి రూ.22,500 ఆర్థిక సహాయం అందజేత**
- **మానవత్వం చాటుకున్న ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్**

**తొలివెలుగు, రామన్నపేట :** ఇటీవల మృతిచెందిన మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన రేవనాల ఐలయ్య కుటుంబానికి నీర్నంల గ్రామానికి చెందిన శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం రూ.22,500 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కష్టసమయంలో బాసటగా నిలవడం సామాజిక బాధ్యతగా భావించి ఈ సాయం అందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి భవిష్యత్తులోనూ తమ అసోసియేషన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఆర్థిక సాయం అందించిన అసోసియేషన్ సభ్యులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త పరశురాములు, ఉపాధ్యక్షుడు పాక రాజు, ప్రధాన కార్యదర్శి కడారి వెంకన్న, కోశాధికారి సాగర్ల వెంకన్న, సభ్యులు నాగటి గణేష్, కడారి నాగరాజు, కొత్త ఉపేందర్, ఇర్రి సురేష్, ఆవుల లక్ష్మీనారాయణ, పాక మని తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటలతోనే అధిక లాభాలు





- **ఎల్‌నినో ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి**
- **'ఆత్మ' డివిజన్ ఛైర్మన్ గనగండ్ల సుధాకర్**
- **సేంద్రియ రైతు గౌటే బాలరాజుకు సన్మానం**

**తొలివెలుగు, రాజపేట :** వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని 'ఆత్మ' డివిజన్ ఛైర్మన్ గనగండ్ల సుధాకర్ కోరారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. శాస్త్రవేత్త నరసింహారెడ్డి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని కోరారు. అనంతరం మండలంలోని రైతు గౌటే బాలరాజు వ్యవసాయ క్షేత్రాన్ని అధికారుల బృందం సందర్శించి, అక్కడ చేపడుతున్న సేంద్రియ వ్యవసాయాన్ని పరిశీలించి ఆయనను ఘనంగా సత్కరించారు. తొలిసారి మండలానికి వచ్చిన సుధాకర్‌ను ప్రజాప్రతినిధులు పూలదండలు, శాలువాలతో ఈ కార్యక్రమంలో ఏఓ పద్మజ, పీఏసీఎస్ ఛైర్మన్ నమిల మహేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చేలువేరు బాలరాజు ఏఈఓలు, ఆత్మ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధియే ధ్యేయం

- **డోర్నకల్ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ పర్యటన**
- **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**
- **విద్యార్థులకు ఉచితంగా బూట్లు, బెల్టుల పంపిణీ**

**తొలివెలుగు, డోర్నకల్/చిన్నగూడూరు :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని దంతాలపల్లి, నర్సింహులుపేట, చిన్నగూడూరు మండలాల్లో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులతో చర్చించారు. చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ గునిగంటి కమలాకర్ తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన టై, బెల్టులు, బూట్లను విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# కిడ్నీ బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

- **రూ.10 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు**
- **ఎమ్మెల్యే రామచంద్రనాయక్ భరోసా**

**తొలివెలుగు, చిన్నగూడూరు :** తీవ్ర కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మండలానికి చెందిన పసునాది విజయ్ తండ్రి వెంకన్నను డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ బుధవారం పరామర్శించారు. చిన్నగూడూరులోని విజయ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, వెంకన్న ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడికి ఆర్థిక సహాయం అందించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామని, బాధితుడికి పింఛను కూడా మంజూరయ్యేలా చూస్తామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బత్తెం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని నాగేష్, బిక్కినాయక్, గంగరబోయిన శ్రీను, దాసరి శ్రీనివాస్, గుండ్ల నిరంజన్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# చదువుల 'పేట'కు శాపం




- **ఇంటర్ కాలేజీ లేక దూరమవుతున్న ఉన్నత విద్య**
- **పక్కా భవనాలున్నా తాళాలే గతి.. మూతబడ్డ మూడు ఎస్సీ హాస్టళ్లు**
- **రాజాపేటకు మంజూరై.. ఆలేరుకు తరలిన బీసీ గురుకులం**
- **ఎన్నికల హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు**

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ద్వితీయ శ్రేణి విద్యనభ్యసించే గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో ఉన్న ఏకైక ప్రైవేటు కళాశాల కూడా మూతపడటంతో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతిరోజూ సుదీర్ఘ ప్రయాణాలు చేయాల్సి రావడం, ఆర్థిక భారంతో పాటు సమయం వృథా అవుతుండటంతో ముఖ్యంగా బాలికల చదువుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భవనాలున్నా మూతబడ్డ వసతిగృహాలు:**

మండలంలో అధికారుల ముందుచూపు లోపంతో మూడు సంక్షేమ వసతిగృహాలు మూతపడ్డాయి. రాజాపేట ఎస్సీ బాలికల హాస్టల్, రఘునాథపురం ఎస్సీ బాలుర హాస్టల్, పారుపల్లి ఎస్సీ బాలుర హాస్టళ్లకు సొంత భవనాలు ఉన్నప్పటికీ వినియోగంలోకి తేకపోవడంతో వ్యర్థంగా మారుతున్నాయి. వీటిని ఇతర ప్రభుత్వ అవసరాలకైనా కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

**ఆలేరులోనే బీసీ గురుకులం:**

రాజాపేట పేరుతో మంజూరైన మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల విద్యాలయం (5 నుంచి ఇంటర్ వరకు) భవన వసతి లేక మొదట చీకటిమామిడిలో, ప్రస్తుతం ఆలేరులో కొనసాగుతోంది. మండల పరిధిలోని రేణికుంట ఖాళీ జెడ్పీహెచ్ఎస్ భవనాన్ని గానీ, ఇతర స్థలాలను గానీ పరిశీలించి రాజాపేటలోనే దీనిని నిర్వహించాలని కోరుతున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రభుత్వ కళాశాల, ఐటీఐ, డిగ్రీ కళాశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని నాయకులు ఇస్తున్న హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయని, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి లోకం విజ్ఞప్తి చేస్తోంది.




## రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

- హెల్మెట్ ధారణతోనే ప్రాణరక్షణ
- వాహనదారులకు ఎస్ఐ గోపాతి సతీష్ అవగాహన

**తొలివెలుగు, రామన్నపేట :** రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని రామన్నపేట ఎస్ఐ గోపాతి సతీష్ సూచించారు. బుధవారం రామన్నపేటలో ఆయన ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ధరించడం, బీమా (ఇన్సూరెన్స్) కలిగి ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు ప్రయాణించే సమయంలో నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ మాట్లాడకూడదని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిబంధనల ఉల్లంఘనల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉండటం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు, స్థానికులు పాల్గొన్నారు.

## మునిపంపుల పాఠశాలకు 'సేవాభారతి' చేయూత

- మునిపంపుల స్కూల్‌కు రూ.25 వేల సౌండ్ సిస్టమ్ విరాళం
- పదో తరగతి టాపర్లకు బహుమతులు అందజేస్తా
- సేవాభారతి వ్యవస్థాపకుడు మన్నె పద్మారెడ్డి



**తొలివెలుగు, రామన్నపేట :** మండలంలోని మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సేవాభారతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మన్నె పద్మారెడ్డి బుధవారం రూ.25 వేల విలువైన మొబైల్ సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. పాఠశాలలో నిర్వహించే వివిధ విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా దీనిని సమకూర్చారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులోనూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. రాబోయే పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు అభినందన పురస్కారాలు ఇస్తామని ప్రకటించారు. అనంతరం దాతను ప్రధానోపాధ్యాయుడు దొడ్డి స్వామి, ఉపాధ్యాయ బృందం సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఉన్నత స్థాయి వ్యక్తులు తాము చదువుకున్న పాఠశాలల పూర్వ వైభవానికి, అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మనోహర్, మంజుల, త్రివేణి ప్రసాద్, సరోజ, పాల్వంచ హరికిషన్, శ్రీశైలం, సునీత, గాదె పారిజాత, రాకేష్, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా ముఠా గుట్టురట్టు

- డిక్కీల్లో దాచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత
- రూ.11.51 లక్షల గంజాయి, రెండు కార్లు జప్తు
- ఒడిశాకు చెందిన ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు




**తొలివెలుగు, నాగోలు :** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును ఎస్ఓటీ ఎల్బీనగర్ జోన్, నాగోలు పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.11.51 లక్షల విలువైన 23.02 కిలోల గంజాయి, రెండు కార్లు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోలు ఎక్స్‌రోడ్డు సమీపంలోని భారత్ పెట్రోల్ పంప్ వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన టయోటా ఇన్నోవా (ఏపీ31ఏజె3312), మహీంద్రా ఎక్స్‌యూవీ300 (ఓడీ05ఏఎక్స్5899) వాహనాలను అడ్డుకుని సోదాలు చేశారు. ఇన్నోవా డిక్కీలోని నాలుగు, ఎక్స్‌యూవీ300 డిక్కీలోని రెండు ప్యాకెట్లలో రహస్యంగా దాచిన గంజాయిని గుర్తించి జప్తు చేశారు. వాహనాల్లో ఉన్న ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన త్రినాథ్ నిరికె (40), సోనా హుంతల్ (28)లను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్లుగా పనిచేసే వీరిద్దరూ ఆర్థిక ఇబ్బందుల వల్ల కోరాపుట్ జిల్లా మల్లిపాడ గ్రామానికి చెందిన 'కమ్ము' అనే వ్యక్తి సూచనలతో హైదరాబాద్‌లో విక్రయించేందుకు గంజాయి తీసుకువచ్చినట్లు విచారణలో తేలింది. నిందితులపై కేసు నమోదు చేయగా, పరారీలో ఉన్న 'కమ్ము' కోసం గాలిస్తున్నారు. ఈ ఆపరేషన్ మల్కాజిగిరి సీపీ బి. సుమతి, డీసీపీ బి. అనురాధ, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. అదనపు డీసీపీ ఎండీ షాకీర్ హుస్సేన్, నాగోలు ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో పోలీసులు, ఎస్ఓటీ, సరూర్‌నగర్ సిబ్బంది సమన్వయంతో గంజాయి ముఠాను పట్టుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# విద్యుత్ సామగ్రి.. పక్కదారి!



**తొలివెలుగు,:** గతంలో స్టోర్స్‌లో సామగ్రి కావాల్సినంత లభ్యమయ్యేది. కానీ రెండేళ్లుగా సామగ్రి కొరతతో పనులు ముందుకుసాగడం లేదు. జరిగే పనుల్లోనూ పూర్తి సామగ్రి దొరకక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే టర్న్‌కీ కాంట్రాక్టర్లు కొందరు తాము చేసే పనులకు సంబంధించిన ఎస్టిమేషన్లలోనే ఎక్కువ సామగ్రి వేసి వాటిని పక్కదారి పట్టిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శివారు ప్రాంతాల్లో ఈ దందా ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిసింది. కొందరు డివిజనల్ స్థాయి అధికారులతో కలిసి స్టోర్లకు సంబంధించిన అధికారులు కూడా కుమ్మక్కై కాంట్రాక్టర్లకు కావలసిన సామగ్రి ఇవ్వడం, వారు చేసిన పనుల్లో అదనంగా చేర్చిన సామగ్రిని నేరుగా తమ ఇంట్లో కానీ, గోడౌన్‌లో కానీ డంప్ చేసి అక్కడినుంచే అమ్మకాలు చేస్తున్నట్లు మింట్ కాంపౌండ్‌లో చర్చించుకుంటున్నారు. వాస్తవానికి స్టోర్ల నుంచి సబ్‌డివిజన్లకు వచ్చిన మెటీరియల్‌ను సెక్షన్ల వారీగా విభజించి సెక్షన్ ఇంజినీర్‌కు అప్పగించాలి. కానీ ఇందుకు భిన్నంగా కొన్ని డివిజన్లలో ఎంత మెటీరియల్ వస్తున్నదనేది కొందరు అధికారులకు మాత్రమే తెలుస్తున్నది. తమకు సంబంధించిన కాంట్రాక్టర్లకు సామగ్రి ఇచ్చి వారి వద్దే ఉంచడం శివారు ప్రాంతాల్లో సాధారణమైంది. స్టోర్ల నుంచి సామగ్రి తీసుకోవడం వాటిని తమ వద్దే పెట్టుకుంటూ ఒకవేళ లైన్‌మెన్లకు, ఆర్టిజన్లకు అవసరమైతే తమ వద్దకే వచ్చి తీసుకోవాలంటూ ఆ కాంట్రాక్టర్లు హూకుం జారీ చేస్తున్నారంటూ కొందరు లైన్‌మెన్లు చెప్పారు. తమ సంస్థ అధికారుల వద్ద ఉండాల్సిన మెటీరియల్ కూడా కాంట్రాక్టర్ల దగ్గరే ఉండడంతో తమకేం చేయాలో తెలియడం లేదని, ఒకవేళ తమకు ఏదైనా వస్తువు అవసరమైతే తమ ఏఈకి చెప్పి లేదా సబ్‌ఇంజినీర్‌కు చెప్పి తెప్పించుకుంటున్నామని, అది కూడా ఆ కాంట్రాక్టర్లు తమ మనుషులతో పంపిస్తారు తప్ప.. తమను ఆ ప్రాంతానికి కూడా రానివ్వరంటూ వారు పేర్కొన్నారు. ఇటీవల మేడ్చల్ జోన్‌లోని ఒక సబ్‌డివిజన్‌కు జనవరి నుంచి జూన్ వరకు కోట్ల రూపాయల విలువైన విద్యుత్ సామగ్రి విడుదలైంది. ఇందులో మూడు సెక్షన్లకు సంబంధించి 40 కిలోమీటర్ల 55 స్కేర్ ఎంఎం కండక్టర్ స్టోర్స్ నుంచి బయటకు వచ్చింది. దాదాపు 20 కిలోమీటర్లకు సరిపడా ఎల్టీ ఏబీ కేబుల్‌ను కూడా స్టోర్ నుంచి డ్రా చేశారు. దీంతో ఎల్టీ, 11కేవీ సామగ్రి అంతరాయాల నివారణ కోసం ఇచ్చారు. తనకు అవకాశం దొరికినప్పుడల్లా తన దగ్గర ఉన్న సామాగ్రి అధిక ధరకు అమ్ముకోవడం, వచ్చిన డబ్బులను తనకు సంబంధించిన అధికారులకు పంచి ఒకవేళ పైస్థాయి నుంచి ఎవరైనా ఒత్తిడి చేస్తే వారికి కొంత ముట్టజెప్తున్నట్లు ఆ సబ్‌డివిజన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. తాము చేసే పనులకు కావాల్సిన సామగ్రి ఎంతమేరకు అవసరమో అంతే తీసుకోవడం లేదా ఒకట్రెండు ఎక్కువ తక్కువలతో ఎస్టిమేషన్లు వేయాలి కానీ శివారు ప్రాంతాల్లోని కొందరు కాంట్రాక్టర్లు ఒక పని చేయడానికి అవసరమైన మెటీరియల్ కంటే ఎక్కువగా తీసుకుంటున్నట్లుగా తెలిసింది.

## 'రేషన్' బియ్యం గుట్టురట్టు

- 20 క్వింటాళ్ల బియ్యంతో వాహనం పట్టివేత
- తనిఖీల్లో పట్టుబడిన పుట్టగూడెం వాసి
- ఎస్ఐ తకియుద్దీన్ వెల్లడి

**తొలివెలుగు, రాజాపేట:** అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాజాపేట ఎస్ఐ తకియుద్దీన్ బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు రాజాపేట పరిధిలో తనిఖీలు చేపట్టారు. పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్యా నితిన్ అనే వ్యక్తి తన అశోక్ లేలాండ్ వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. వెంటనే బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నిరుపేదలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా లేదా నిల్వ (డంప్) చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉద్ధృతం

- సిపిఎస్ రద్దు, పీఆర్సీ అమలు కోసం యుఎస్‌పిసి పోరుబాట
- తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేసిన యు.ఎస్.పి.సి.
- ఈనెల 19న ధర్నాలు, 29న 'ఛలో అసెంబ్లీ'కి పిలుపు



**తొలివెలుగు, రాజాపేట :** ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే దశలవారీగా పోరాటాలు ఉద్ధృతం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యు.ఎస్.పి.సి) హెచ్చరించింది. బుధవారం భోజన విరామ సమయంలో మండల కేంద్రంలో నిరసన తెలప అనంతరం తహసిల్దార్ గోలి రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలతో పాటు అన్ని రకాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా జీవో 25ను సవరించాలని కోరారు. ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, జీవో 317 బాధితులకు సొంత జిల్లాలకు బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, విద్యా సంవత్సరంలో శిక్షణ తరగతులు కేటాయించవద్దని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్, డీటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు మధుసూదన్, మహేందర్, మహిపాల్ రెడ్డి, లెనిన్, నాగరాజు, వీరభద్రం, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

- కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పలువురు నాయకులు, గ్రామాల ప్రముఖుల కుటుంబాలను బుధవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. మురిపిరాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవళ్ల స్వామి, ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన గుండెగాని యాదమ్మ, నాగం శ్రీరాంరెడ్డి, సర్వేపల్లి గ్రామానికి చెందిన కల్వకుంట్ల లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల నివాసాలకు వెళ్లిన ఎమ్మెల్యే ఐలయ్య మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, వ్యక్తిగతంగానూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందడి అనంతరెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 'ఉచిత వైద్యం.. పేదలకు అభయం'

- రఘునాథపురంలో ఘనంగా మేగా వైద్య శిబిరం
- 200 మందికి ఉచితంగా పరీక్షలు, మందులు
- 25 మందికి మెడిసిటీలో ఉచిత ఆపరేషన్లు




**తొలివెలుగు, రాజాపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రఘునాథపురంలో శ్రీ వినాయక ఫౌండేషన్, మేడ్చల్ ఘన్‌పూర్ మెడిసిటీ ఆసుపత్రి యాజమాన్యం, పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మేగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మార్కండేయ పద్మశాలి సంఘ భవనంలో మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్ కుమార్, సంఘ ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజకుమార్, జర్నలిస్ట్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా గ్రామస్థులకు బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు పరీక్షలతో పాటు మోకాళ్లు, వెన్నుపూస నొప్పులు, థైరాయిడ్, గర్భసంచి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ.. శస్త్రచికిత్సలు అవసరమైన 25 మంది బాధితులను గుర్తించామని, వారిని తమ ఆసుపత్రి బస్సులో ఉచితంగా తీసుకెళ్లి ఆపరేషన్లు పూర్తి చేసి తిరిగి స్వగ్రామానికి చేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్, సంఘం అధ్యక్షుడు బింగి బాలరాజ్, కటకం పెద్ద వెంకటేశం, సామల భాస్కర్, నాగేష్, కటకం నాగేష్, బల్ల నరహరి, బింగి రమేష్, నల్ల అశోక్, వెంగల్ దాస్ వెంకటేశం, బల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి పూజలు

- శివుడికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ
- భక్తులకు వేదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ

**తొలివెలుగు, రాజాపేట :** స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని పరమశివుడికి విశేష పూజా కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు నంగునూరు చంద్రశేఖర్, ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చక స్వాములు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాలు, ఫలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, దీపారాధన, మంగళహారతి, భజన కార్యక్రమాలు చేపట్టారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో ప్రముఖ భక్తులు సందీప్‌రెడ్డి - ప్రసన్న, రంగ నరసింహులు - లక్ష్మి దంపతులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## వలిగొండలో వైభవంగా 'తిరంగా ర్యాలీ'

- ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహణ
- విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించాలి: నాయకులు





**తొలివెలుగు, వలిగొండ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి బుధవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కుల సంఘాల పెద్దలు మాట్లాడుతూ తిరంగా ర్యాలీ దేశ ప్రజల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, నాటి నుంచే విద్యార్థుల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ దేశ ఉన్నతి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ వెంకట పాపిరెడ్డి, బీసీ సంఘం నాయకుడు సాయిని యాదగిరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు యాదగిరి, బీజేపీ సీనియర్ నాయకులు రాచకొండ కిష్ట, కనతాల అశోక్ రెడ్డి, బందారపు రాములు గౌడ్, రాస వెంకట్, మైసోళ్ల రామనర్స్, బచ్చు శ్రీనివాస్, మైసోళ్ల మచ్చగిరి, మండల పదాధికారులు నాగరాజు, రంజిత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్, కార్యదర్శులు వెంకటేశం, మహేష్, శ్రీనివాస్, నాయకులు నరసింహ, రామచంద్రం, చిన్న మచ్చగిరి, మటూరి కృష్ణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో క్రషర్ వద్దు: రైతుల ఆందోళన

- గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పహిల్వాన్‌పూర్ రైతుల నిరసన
- అభ్యంతరాలు పట్టించుకోకుండా అనుమతులేలా ఇస్తారు?

**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పూర్ గ్రామంలో పంట పొలాల మధ్య అక్రమంగా నిర్మిస్తున్న క్రషర్ మిషన్ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. గ్రామ ప్రజల, రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం క్రషర్‌కు అనుమతులు మంజూరు చేయడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. క్రషర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామంలో ఇప్పటికే మూడుసార్లు సభలు నిర్వహించి తమ అభ్యంతరాలను స్పష్టంగా తెలిపామన్నారు. అయినా తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అనుమతులు ఎలా ఇస్తారని నిలదీశారు. క్రషర్ నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల పంటలు దెబ్బతినడంతో పాటు వ్యవసాయ భూములు సారం కోల్పోయి నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల ఆరోగ్యం క్షీణించి జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి అనుమతులను పరిశీలించి, క్రషర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ ఆందోళనలో రైతులు ఎలిమినేటి జంగారెడ్డి, శ్రీశైలం రెడ్డి, సత్తిరెడ్డి సునీత, మల్లారెడ్డి కలమ్మ, వెంకట్ రెడ్డి విమల, మోహన్ రెడ్డి పద్మ, శ్రీనివాస్ రెడ్డి, అంజమ్మ, బుచ్చిరెడ్డి లక్ష్మి, దుబ్బ రమేష్, బాల నర్సమ్మ, వట్టిపల్లి స్వామి, పైల మోహన్ రెడ్డి, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 'అయ్యో పాప'.. వైద్యం వికటించి పసికందు బలి

- శ్రీ సాయి ఆసుపత్రి నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు
- మార్గమధ్యంలో కన్నుమూసిన ఐదు నెలల చిన్నారి

**తొలివెలుగు, ఆలేరు:** ఆలేరు పట్టణంలో ఆసుపత్రి వర్గాల నిర్లక్ష్యానికి ఐదు నెలల పసికందు బలయ్యిందంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... ఆత్మకూరు మండలం సింగారానికి చెందిన మందుల అనిల్, పద్మ దంపతుల ఐదు నెలల కుమార్తె తరుణీక జ్వరం, జలుబుతో బాధపడుతుండటంతో మంగళవారం సాయంత్రం ఆలేరు బస్టాండ్ సమీపంలోని శ్రీ సాయి ఆసుపత్రికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయానికి జ్వరం మరింత తీవ్రమవడంతో మళ్లీ అదే ఆసుపత్రికి తీసుకురాగా, పాప పరిస్థితి విషమంగా ఉందంటూ పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో ఆందోళనతో మెరుగైన చికిత్స కోసం వేరే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పసికందు కన్నుమూసింది. వైద్యం వికటించడం వల్లే తమ బిడ్డ ప్రాణాలు పోయాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై ఆలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## 'సురక్షిత ప్రయాణమే అందరికీ క్షేమం'

- అంకిరెడ్డిగూడెంలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు
- ఆటో డ్రైవర్లు, కార్మికులకు ట్రాఫిక్ పోలీసుల సూచనలు

**తొలివెలుగు, చౌటుప్పల్:** రహదారి నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేశం అన్నారు. జిల్లా ఎస్పీ, ట్రాఫిక్ డీఎస్పీల ఆదేశాల మేరకు బుధవారం అంకిరెడ్డిగూడెం గ్రామంలో చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, కంపెనీ కార్మికులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశం మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వేగం కంటే భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ఆయన.. వాహనం నడిపేటప్పుడు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను నిరంతరం పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, కంపెనీ కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.



## గిరిజన యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు బీజేపీ ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్ వినతి
- గిరిజన కాలనీలు, తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

తొలివెలుగు, చౌటుప్పల్/హైదరాబాద్: చౌటుప్పల్ మండల పరిధిలోని పరిశ్రమల్లో గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ చౌటుప్పల్ 18వ వార్డు కౌన్సిలర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్ బుధవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని దిల్కుషా భవన్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులను కలిసిన బుడ్డ సురేష్.. చౌటుప్పల్ మండల పరిధిలో అనేక పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానిక గిరిజన యువతకు తగిన స్థాయిలో ఉపాధి అవకాశాలు లభించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశ్రమల్లో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా సంబంధిత యాజమాన్యాలతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన కాలనీలు, వార్డులు, గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను గిరిజన ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించేలా చూడాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్య, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని బుడ్డ సురేష్ కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



# అర్హులైన వారందరికీ అన్ని రకాల పెన్షన్లు ఇవ్వాలి

- చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా
- పెన్షన్లపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి: ఎండీ పాషా

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని పేదలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని రకాల సామాజిక భద్రతా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ పాషా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికల ముందు పెన్షన్లను రెట్టింపు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం నిధుల కొరత పేరుతో వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వకుండా ఇతర పెన్షన్లను మాత్రమే అందిస్తూ ఎన్నికల హామీలను దాటవేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అన్ని రకాల పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షన్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు బండారు నరసింహ, ఆకుల ధర్మయ్య, గోపగోని లక్ష్మణ్ గౌడ్, బత్తుల శ్రీశైలం గౌడ్, భావనలపల్లి స్వామి, బత్తుల లక్ష్మయ్య, సప్పిడి శ్రీనివాసరెడ్డి, సిల్వేరు జంగయ్య, మగుదల రాములు, బాబు, బిక్షపతి, తూర్పునూరి మల్లేశం పాల్గొన్నారు.




## నూతన పెన్షన్ల నిబంధనలను సవరించాలి: సీపీఎం

- తెల్ల రేషన్‌కార్డు ఉన్న అందరికీ ఆసరా పెన్షన్లు ఇవ్వాలి
- నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టడం తగదు: సిర్పంగి స్వామి

**తొలివెలుగు, వలిగొండ :** నూతన పెన్షన్ల మంజూరు కోసం ప్రభుత్వం విడుదల చేసిన విధివిధానాల్లోని కఠిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని సీపీఎం వలిగొండ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు పంపిణీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అనేక నిబంధనలు విధిస్తూ లబ్ధిదారుల సంఖ్యలో కోత పెట్టాలని చూడడం సరికాదన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నప్పటికీ మళ్లీ ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అనడం, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయనే నెపంతో దరఖాస్తులను తిరస్కరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉపాధి కోసం వాహనాలు కొనుగోలు చేసిన పేద కుటుంబాలకు ఇది తీవ్ర అన్యాయం చేయడమేనన్నారు. 57 ఏళ్లు నిండిన వృద్ధులకు, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ.. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని, పాత దరఖాస్తులను పరిశీలించి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



## ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- తహసిల్దార్ లావణ్యకు యూఎస్‌పీసీ వినతిపత్రం
- బడుల కుదింపు ఆలోచన వీడాలని డిమాండ్

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** మండల పరిధిలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో బుధవారం తహసిల్దార్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ పాఠశాలలను కుదించే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించి, పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కేజీబీవీ ఉద్యోగులకు కనీస వేతనం (మినిమం బేసిక్ పే) అమలు చేయాలని, బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రకారం పీఎస్ హెచ్‌ఎమ్‌లుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ టీచర్లకు 12 నెలల వేతనం అందించాలని, ఏకీకృత సర్వీస్ నిబంధనలు రూపొందించి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఉద్యోగులందరికీ అన్ని ఆసుపత్రుల్లో హెల్త్ కార్డ్ ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఇటికాల రవీందర్, నాయకులు కొణతం శ్రీనివాస్, అశోక్ రెడ్డి, దొడ్డి రవి, గడ్డమీది శ్రీను, వెంకట నర్సయ్య, శేఖర్, శ్రీనివాసాచారి, వెంకటేశం, అనంతరెడ్డి, కృష్ణ, వెంకన్న, హచ్చు నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## క్యాన్సర్ నివారణకు టీకాలు అవసరం

- వైద్యుల సలహాతో 'గార్డాసిల్' వ్యాక్సిన్ తీసుకోవాలి
- ఆరోగ్యకర సమాజం కోసం ముందడుగు వేద్దాం: శాన్వి

**తొలివెలుగు, చౌటుప్పల్:** సరైన సమయంలో వైద్యుల సలహాలు పాటిస్తూ అవసరమైన టీకాలు వేయించుకోవడం ద్వారా కొన్ని క్యాన్సర్ల ముప్పును తగ్గించుకునే అవకాశం ఉందని చౌటుప్పల్‌కు చెందిన డీ. శాన్వి తెలిపారు. వైద్యురాలు డాక్టర్ ప్రశాంతి సలహా మేరకు తాను 'గార్డాసిల్ 9' వ్యాక్సిన్ తీసుకున్నానని, తన తమ్ముడు సన్వీర్‌కు 'గార్డాసిల్ 4' వ్యాక్సిన్ వేయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా శాన్వి మాట్లాడుతూ.. క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యాక్సిన్ తీసుకోని వారు తమ వయస్సు, ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్య నిపుణులను సంప్రదించి, తమకు తగిన టీకా అవసరమా అనే విషయంపై వైద్యుల సలహా తీసుకోవాలని కోరారు. క్యాన్సర్ నివారణ, వ్యాక్సినేషన్‌కు సంబంధించిన సరైన సమాచారాన్ని ప్రజలంతా తెలుసుకోవాలని డాక్టర్ ప్రశాంతి, శాన్వి, సన్వీర్ కోరారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.




## ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి నిరంతరం కృషి

- చౌటుప్పల్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్షుడిగా సుక్క స్వామి.. ప్రధాన కార్యదర్శిగా వనం రుషి
- జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోజు యజ్ఞమాచారి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక





**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోజు యజ్ఞమాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా సుక్క స్వామి, ఉపాధ్యక్షులుగా ఎర్ర శివ, వరికుప్పల మహేష్, ప్రధాన కార్యదర్శిగా వనం రుషి, కోశాధికారిగా రోషణగారి రాఘవేంద్ర గౌడ్, సహాయ కార్యదర్శిగా పల్లెర్ల సుజిత్, ప్రచార కార్యదర్శిగా పగడాల శంకర్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా తోర్పునూరి సాయిలు గౌడ్, చింతల గణేష్, భారత మధు, వరగంటి వెంకటేష్, నందగిరి పరమేష్, జక్క చలమంద రెడ్డి, బోడిగే ప్రభాకర్లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మలిగె రవి, పగిళ్ల మహేష్, డాకోజీ వెంకట శివకుమార్, జాజుల రామకృష్ణ, పెడకంటి నాగేంద్రలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యలపై సమష్టిగా పోరాడుతామని పేర్కొన్నారు.

# జడ్జి యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు.. దోషిగా తేల్చిన పార్లమెంటరీ కమిటీ

- అగ్నిప్రమాదం తర్వాత ఇంట్లో భారీగా కాలిపోయిన నోట్లు లభ్యం
- నగదు మూలాలపై వర్మ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని కమిటీ వెల్లడి
- విచారణలో లోపాలు, సాక్ష్యాలు మాయం కావడంపై కమిటీ తీవ్ర వ్యాఖ్యలు
- రాజీనామా చేయడంతో వర్మపై అభిశంసన ప్రక్రియ నిరర్థకం

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో బయటపడిన భారీ నగదు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై విచారణ జరిపిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ.. జస్టిస్ వర్మను దోషిగా నిర్ధారించింది. తన నివాసంలో లభించిన నగదుకు సంబంధించి సంతృప్తికరమైన వివరణ ఇవ్వడంలో వర్మ విఫలమయ్యారని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ నివేదికను బుధవారం పార్లమెంటులో సమర్పించారు.ం2025 మార్చి 14 రాత్రి న్యూఢిల్లీలోని తుగ్లక్ క్రెసెంట్‌లో ఉన్న జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. మంటలను ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బందికి అక్కడి స్టోర్‌రూంలో పెద్ద మొత్తంలో కాలిపోయిన కరెన్సీ నోట్లు కనిపించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. "స్టోర్‌రూంలో వివరణ లేని రూ. 500 కరెన్సీ నోట్లు భారీగా లభించాయి. ఆ నగదుకు సంబంధించిన మూలాలు, యాజమాన్యంపై జడ్జి సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేకపోయారు" అని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఈ కేసులో తదనంతర దర్యాప్తు తీరును కూడా కమిటీ తీవ్రంగా తప్పుబట్టింది. "కీలకమైన సాక్ష్యాధారాలను సరిగా భద్రపరచలేదు. చట్టప్రకారం సీల్ చేసి, తనిఖీ చేయడానికి ముందే స్టోర్‌రూంలోని ఆధారాలను చెరిపేశారు. ఆ తర్వాత కరెన్సీ నోట్లు కనిపించకుండా పోవడంపై ఇప్పటికీ స్పష్టత లేదు" అని కమిటీ వ్యాఖ్యానించింది. అయితే, నగదును జడ్జి వ్యక్తిగతంగా తొలగించినట్లు తమకు ఆధారాలు లభించలేదని కమిటీ పేర్కొంది. నగదు ఉనికిపై 2025 మార్చి 22న వర్మ ఇచ్చిన సమాధానం సహా ఆయన వివరణలు "అసంతృప్తికరంగా" ఉన్నాయని కమిటీ తేల్చి చెప్పింది. "వర్మ స్పందనలో నిజాయతీ, పారదర్శకత, సంస్థాగత బాధ్యత లోపించాయి" అని నివేదికలో ఘాటుగా వ్యాఖ్యానించింది. గతంలో, అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ కూడా.. నగదు దాచిన స్టోర్‌రూంపై జస్టిస్ వర్మకు "ప్రత్యక్ష లేదా పరోక్ష నియంత్రణ" ఉందని నిర్ధారించింది. ఈ వివాదం తర్వాత ఆయనను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. పార్లమెంటులో ఆయనపై అభిశంసన ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే, ఆ తర్వాత జస్టిస్ వర్మ తన పదవికి రాజీనామా చేయడంతో ఆ ప్రక్రియ నిరర్థకమైంది.



# కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

భారత్‌లోని అగ్రశ్రేణి లిస్టెడ్ కంపెనీల్లో అత్యున్నత కార్యనిర్వాహక పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టర్నోవర్ ప్రాతిపదికన టాప్ 500 కంపెనీల్లో కేవలం 9 మంది మహిళలు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా (సీఈవో), 25 మంది మేనేజింగ్ డైరెక్టర్లుగా (ఎండీ) బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా సోమవారం లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంసీఏ21 డేటాబేస్ గణాంకాల ప్రకారం, ఈ 500 కంపెనీల్లో మొత్తంగా 860 మంది మహిళలు బోర్డు సభ్యులుగా, డైరెక్టర్లుగా ఉన్నారు. వీరిలో 738 మంది డైరెక్టర్లు, 67 మంది పూర్తికాల డైరెక్టర్లు, 18 మంది అదనపు డైరెక్టర్లు, 12 మంది నామినీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే, 22 మంది మహిళలు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లుగా (సీఎఫ్ఓ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు మంత్రి వివరించారు. కంపెనీల చట్టం-2013 నిబంధనల ప్రకారం, ప్రతి లిస్టెడ్ కంపెనీ బోర్డులో కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించడం తప్పనిసరి. ఈ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత బోర్డు స్థాయిలో మహిళల సంఖ్య పెరిగినప్పటికీ, సీఈవో, ఎండీ వంటి కీలక పదవుల వద్దకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అయితే, మహిళా డైరెక్టర్లు ఉన్నత నాయకత్వ స్థానాలకు ఎదగడానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రత్యేక అధ్యయనం నిర్వహించలేదని, కొత్త విధానాలు లేదా ప్రోత్సాహకాలు ఏవీ ప్రస్తుతం పరిశీలనలో లేవని మల్హోత్రా స్పష్టం చేశారు. మరోవైపు, మహిళా డైరెక్టర్లను నియమించడంలో విఫలమైన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు సంబంధించి మొత్తం 50 ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆయా సంస్థలపై రూ. 71.01 లక్షల జరిమానా విధించినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్న మొత్తం కంపెనీల్లో సుమారు 39 లక్షల మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో మహిళల సంఖ్య 11.6 లక్షలుగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



# రైల్ వన్' యాప్‌కు విశేష ఆదరణ.. 4.76 కోట్లు దాటిన డౌన్‌లోడ్లు

భారతీయ రైల్వేకు చెందిన ఏకీకృత మొబైల్ యాప్ 'రైల్ వన్' సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఈ యాప్ ఇప్పటివరకు 4.76 కోట్ల డౌన్‌లోడ్లను అధిగమించిందని, దీని ద్వారా ప్రతిరోజూ సగటున 10 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం నాడు లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్న ఈ వివరాలను వెల్లడించారు. రైల్వే ప్రయాణికుల ప్రయాణ అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ యాప్‌ను ప్రారంభించారు. గతంలో వేర్వేరు యాప్‌లు, వెబ్‌సైట్లలో విడివిడిగా అందుబాటులో ఉండే టికెట్ బుకింగ్, పీఎన్‌ఆర్ స్టేటస్, లైవ్ ట్రైన్ ట్రాకింగ్, ఫుడ్ ఆర్డరింగ్, ఫిర్యాదుల నమోదు వంటి సేవలన్నీ ఇప్పుడు 'రైల్ వన్' వేదికగా ఒకే చోట లభిస్తున్నాయి. ఒకే అప్లికేషన్‌లో అన్ని రకాల సౌకర్యాలు లభిస్తుండటంతో ప్రయాణికులు ఈ యాప్‌ను వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రోజుకు సగటున 10 లక్షల టికెట్లు బుక్ అవుతుండటం ఈ యాప్‌కు లభిస్తున్న ఆదరణకు నిదర్శనమని మంత్రిత్వ శాఖ తెలిపింది. రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ విభాగాల్లో ఈ బుకింగ్స్ జరుగుతున్నాయని వివరించింది. యాప్‌లో ఎప్పటికప్పుడు నూతన ఫీచర్లను అందుబాటులోకి తీసుకురావడం, సర్వర్ల సామర్థ్యాన్ని పెంచడం వల్లే ఎటువంటి అంతరాయం లేకుండా సేవలను అందించగలుగుతున్నామని పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రయాణికులకు డిజిటల్ సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో రైల్వే శాఖ ఈ యాప్‌ను ప్రోత్సహిస్తోంది.





# ఏసీల ధరలకు రెక్కలు..

## 12 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించిన బ్లూస్టార్

హైదరాబాద్: ఎయిర్ కండిషనర్ల(ఏసీ) ధరలకు రెక్కలొచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కమోడిటీ ఉత్పత్తులు భగ్గుమనడంతో దేశవ్యాప్తంగా ఏసీ ధరలు భారీగా పెంచుతున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు 10 శాతం వరకు ధరలు పెంచుతున్నట్టు ప్రకటించగా.. తాజాగా ఈ జాబితాలోకి ప్రముఖ ఏసీల తయారీ సంస్థ బ్లూస్టార్ కూడా చేరింది. కంపెనీకి చెందిన ఏసీల ధరలను 12 శాతం వరకు పెంచుతున్నట్టు కంపెనీ గ్రూపు ప్రెసిడెంట్ మోహిత్ సుద్ తెలిపారు. రాగి, అల్యూమినియంతోపాటు నూతన విద్యుత్ నిబంధనలు అమలు చేయడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఏసీల ధరలను పెంచాల్సి వస్తున్నదన్నారు. దీంతో ఫైవ్-స్టార్ ఏసీలు కనిష్ఠంగా 5 శాతం వరకు గరిష్ఠంగా 15 శాతం వరకు సవరించినట్టు చెప్పారు. జీఎస్టీని 10 శాతానికి తగ్గించడంతో ఏసీల ధరలు దిగొచ్చాయని, కానీ యుద్ధ ప్రభావంతో వీటి ధరలు 15 శాతం పెరగడంతో మొత్తంగా గతేడాదితో పోలిస్తే వీటి ధరలు 5 శాతం వరకు అధికమయ్యాయన్నారు.రాష్ట్ర మార్కెట్లోకి నూతన శ్రేణి రూమ్ 125 రకాల ఏసీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏసీల అమ్మకాలు 5 శాతం పడిపోయే అవకాశాలున్నాయని, ప్రధానంగా ధరలు పెరుగడం, వర్షాభావ పరిస్థితులు కూడా మరో కారణమన్నారు.

# కోటక్ మహీంద్రాలో భారీ కుంభకోణం కలకలం




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో జరిగిన రూ. 590 కోట్ల భారీ కుంభకోణం మరువకముందేమరో బ్యాంకులో జరిగిన భారీ మోసం కలకలం రేపుతోంది. హర్యానాలో కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో రూ. 160 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఖీణ) కుంభకోణం వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి హర్యానాలోని పంచకుల మునిసిపల్ కార్పొరేషన్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల విలువ దాదాపు రూ. 160 కోట్లు. అయితే, ఎఫ్‌డీల్లో జమ చేసిన నిధులు అసలు డిపాజిట్టే కాలేదు. నకిలీ పత్రాలు సృష్టించి ఆ సొమ్మును ఇతర మోసపూరిత ఖాతాలకు మళ్లించారు. ఇందుకోసం హర్యానాకు చెందిన పంచకుల మున్సిపల్ కార్పొరేషన్‌కు నకిలీ పత్రాలను జారీ చేశారని అధికారులు గుర్తించారు. ఈ భారీ మోసంలో బ్యాంక్ ఉద్యోగులతో పాటు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల ప్రమేయం కూడా ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**వెలుగులోకి ఎలా వచ్చింది?**

రూ. 58 కోట్ల విలువైన ఒక ఖీణ గడువు ముగిసిన తర్వాత, ఆ మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని కార్పొరేషన్ బ్యాంకును కోరినప్పుడు ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. బ్యాంకు స్టేట్‌మెంట్ ప్రకారం బదిలీ పూర్తయినట్లు చూపించినప్పటికీ, ఆ నిధులు కార్పొరేషన్ ఖాతాకు చేరలేదు. ఆరా తీస్తే ఆ బ్యాంక్ స్టేట్‌మెంట్ కూడా నకిలీదేనని నిర్ధారణ అయ్యింది.డబ్బు మాయమైపోయిందని తేలింది. ఈ వ్యవహారంలో బ్యాంకు జారీ చేసిన ఖీణలన్నీ నకిలీవని, ఖాతాలో అసలు నిధులే లేవని గుర్తించారు. నకిలీ పత్రాలను ఉపయోగించి బ్యాంకు ఉద్యోగులు చాలాకాలం పాటు ఈ నిధుల దుర్వినియోగాన్ని దాచిపెట్టారని ఆరోపణలు వెల్లువెత్తాయి.తమ ఎఫ్‌డీ నిధులను బదిలీ చేయమని బ్యాంకును కోరినప్పుడే ఈ వ్యవహారం బైటపడిందని, పంచకుల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కుమార్ తెలిపారు. ఇదే విషయాన్ని స్టేట్ విజిలెన్స్‌కు నివేదించారు. బ్యాంక్‌పై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడంతో పాటు, ఆ బ్యాంక్‌ను ప్రభుత్వ పనుల నుండి తొలగించాలని (ఎవ-వఎజుఝఅవశ్రీ) హర్యానా ప్రభుత్వాన్ని కోరారు.

# గ్యాస్ కొరతకు చెక్.. 20 శాతం పెరిగిన కేటాయింపు!



భారతదేశంలో వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల లభ్యతను మరింత బలపరచడానికి ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. ఇందులో భాగంగానే.. దేశవ్యాప్తంగా కమర్షియల్ సరఫరాను పెంచే నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అదనంగా 20% కమర్షియల్ సిలిండర్ల కేటాయింపును ఆమోదించింది. దీంతో మొత్తం కేటాయింపు సగటు నెలవారీ అవసరంలో 50%కి పెరిగింది. ఈ పెంపు వలన వాణిజ్య రంగాలకు గ్యాస్ సరఫరా మరింత స్థిరంగా, సమృద్ధిగా అందుబాటులో ఉంటుంది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సేవలు వంటి రంగాలు గ్యాస్ కొరత నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుంది. కాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ సిలిండర్లను సమయానికి, సులభంగా అందేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నిర్ణయం వల్ల వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను అంతరాయం లేకుండా కొనసాగించగలుగుతాయి. అంతేకాకుండా, వినియోగదారులకు ఆహారం, ఇతర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చేస్తుంది. గ్యాస్ కొరత కారణంగా ఎదురయ్యే సమస్యలు తగ్గుతాయి. ధరల స్థిరత్వం కూడా మెరుగుపడే అవకాశం ఉంది.

# గల్ఫ్ ఉద్రిక్తతల ప్రభావం


# రూపాయి, ద్రవ్యోల్బణ దెబ్బకు వడ్డీరేట్లు పైపైకి?




న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి (60 బేసిస్ పాయింట్లు) పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది.

**4.6 శాతానికి ద్రవ్యోల్బణం!**

ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయగలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హొర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం (ఏప్రిల్ 15) వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగదారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగుతుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది.



# నెలకు అద్దె ఏ రూ.1.2 లక్షలు!

కలల నగరం ముంబైలో అద్దె కోసం ఇల్లు దొరకడం ఒక ఎత్తయితే, దాని అద్దె చెల్లించడం మరో ఎత్తు. సామాన్యుడి నెల జీతం కంటే కొన్ని ప్రదేశాల్లో ఇక్కడ అద్దెలే ఎక్కువగా ఉంటాయన్నది జీర్ణించుకోలేని వాస్తవం. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో ముంబై జీవన ప్రమాణాలు, అద్దె భారం గురించి చర్చకు తెరలేపింది. ప్రముఖ వ్లాగర్ ఆర్య కొఠారి తన ఇన్‌స్టాగ్రామ్ సిరీస్ 'రెంట్ ఇన్ ముంబై - ఈపీ 4' లో భాగంగా అంధేరీ వెస్ట్ ప్రాంతంలో ఒక యువతిని ఇంటర్వ్యూ చేశారు. ఆ ప్రాంతంలో ఒక 3బీహెచ్‌కే (మూడు పడకగదుల) ఫ్లాట్ కోసం ఆమె నెలకు ఏకంగా రూ.1.2 లక్షలు అద్దె చెల్లిస్తున్నట్లు వెల్లడించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆ విశాలమైన గది, ఆధునిక వంటగది చూస్తుంటే ముంబై వంటి నగరంలో అది ఎంత లగ్జరీనో అర్థమవుతుంది. ఈ వీడియోపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. 'ముంబైలో అద్దె కట్టడమే ఒక పూర్తిస్థాయి ఉద్యోగంలా మారిపోయింది' అని ఒక యూజర్ వ్యాఖ్యానించారు. 'ఒకరికి రూ. 1.2 లక్షల అద్దె సౌకర్యం కావచ్చు, మరొకరికి రూ.80 వేల జీతంతో బతకడమే పెద్ద పోరాటం కావచ్చు' అని మరికొరు అన్నారు.

# జియో.. జెరోధా.. ?కొత్త మ్యూచువల్ ఫండ్‌లు




జెరోధా మ్యూచువల్ ఫండ్ నుంచి నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 50:50 ఇండెక్స్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ 23న ప్రారంభం కానుంది. ఏప్రిల్ 6 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఇన్వెస్టర్లు రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ ఫండ్‌ను కేదార్‌నాథ్ మిరాజ్‌కార్ నిర్వహించనున్నారు. ఈ ఫండ్ అధిక రిస్క్ కిందకు వస్తుంది. నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 400 50:50 ఇండెక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. కనుక సూచీ రాబడులే ఈ పథకం పనితీరుకు ప్రామాణికంగా ఉంటాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో బలమైన వృద్ధి అవకాశాలున్న కంపెనీల్లో దీర్ఘకాలం పెట్టుబడుల ద్వారా మెరుగైన సంపద సృష్టించుకోవాలని భావించే ఇన్వెస్టర్లకు ఈ పథకం అనుకూలంగా ఉంటుంది.

**జియో బ్లాక్‌రాక్ లార్జ్‌క్యాప్ ఫండ్**

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా జియో బ్లాక్‌రాక్ లార్జ్‌క్యాప్ ఫండ్‌ను తీసుకొచ్చింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఈ నెల 24న ప్రారంభమై, ఏప్రిల్ 7న ముగుస్తుంది. లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడిని వృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశ్యం. బీఎస్ఈ 100 ఇండెక్స్ (టీఆర్ఐ) ఈ పథకం పనితీరుకు ప్రామాణికం. తన్వి కచేరియా, సాహిల్ చౌదరి ఈ పథకానికి మేనేజర్లుగా వ్యవహరించనున్నారు. డైరెక్ట్‌ప్లాన్ (మధ్యవర్తుల ప్రమేయం లేని), గ్రోత్ ఆప్షన్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 80--100 శాతం వరకు, 0--20 శాతం మేర ఇతర కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది.

# 30 రోజుల రీఛార్జ్ తప్పనిసరి!

మొబైల్ వినియోగదారుల ప్రయోజనాలే పరమావధిగా టెలికాం రంగంలో మార్పులకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాజ్యమేలుతున్న 28 రోజుల రీఛార్జ్ ప్లాన్ల స్థానంలో పూర్తి 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టెలికాం ఆపరేటర్లపై కేంద్రం ఒత్తిడి పెంచుతోంది. ఇటీవల రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా లేవనెత్తిన అంశాలపై కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సానుకూలంగా స్పందించారు. సాధారణంగా నెల అంటే 30 లేదా 31 రోజులు ఉంటుంది. కానీ, టెలికాం కంపెనీలు నెలవారీ ప్లాన్ పేరిట 28 రోజుల వ్యాలిడిటీనే ఇస్తున్నాయి. దీనివల్ల వినియోగదారుడు ఏడాదికి 12 సార్లు కాకుండా 13 సార్లు రీఛార్జ్ చేయాల్సి వస్తోందని రాఘవ్ చద్దా పార్లమెంటులో గళమెత్తారు. ఆయన లేవనెత్తిన అంశాలు కింది విధంగా ఉన్నాయి.


ఒకరోజుకు 2 జీబీ డేటా ఇస్తే వినియోగదారుడు 1.5 జీబీ మాత్రమే వాడితే మిగిలిన 0.5 జీబీ అర్ధరాత్రికి మాయమైపోతోంది.

ది వినియోగదారుడిని వంచించడమే. ఉపయోగించని డేటాను మరుసటి రోజుకు క్యారీ ఫార్వర్డ్ చేయాలి.

రీఛార్జ్ గడువు ముగిసిన వెంటనే ఇన్‌కమింగ్ కాల్స్ నిలిపివేయడం సరికాదు. కనీసం ఏడాది పాటు ఇన్‌కమింగ్ సదుపాయం ఉండాలి. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనల ప్రకారం.. ప్రతి ఆపరేటర్ తమ ప్లాన్ల జాబితాలో కచ్చితంగా 30 రోజుల ప్లాన్‌ను చేర్చాలని మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. 'కంపెనీలు అందించే ప్లాన్ ఆప్షన్లలో కచ్చితంగా 30 రోజుల ప్లాన్ ఉండాలి. ఈ నిబంధనను కంపెనీలు పాటిస్తున్నప్పటికీ వాటిని వినియోగదారులకు తెలిసేలా మరింతగా మార్కెటింగ్ చేయాలని కోరుతున్నాం' అని జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు.

**ట్రాయ్ నిబంధనలు ఏం చెబుతున్నాయి?**


2022లోనే ట్రాయ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ప్రతి టెలికాం సంస్థ ప్లాన్ వోచర్లు, ప్రత్యేక టారిఫ్ వోచర్లు, కాంబో వోచర్ల రూపంలో కనీసం ఒక 30 రోజుల ప్లాన్‌ను అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం 'టారిఫ్ ఫోర్బేరెన్స్' విధానం అమలులో ఉండటంతో ధరలు, సర్వీసు నిబంధనలు నిర్ణయించుకునే స్వేచ్ఛ ఆపరేటర్లకు ఉంది. అయినప్పటికీ, వినియోగదారులను ఇబ్బంది పెట్టకుండా ట్రాయ్ నిరంతరం పర్యవేక్షిస్తోంది. పార్లమెంటులో ఎంపీలు లేవనెత్తిన అభ్యంతరాలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో.. రీఛార్జ్ వ్యాలిడిటీ పీరియడ్, ఇన్‌కమింగ్ కాల్స్ నిలిపివేత అంశాలను ట్రాయ్ ప్రస్తుతం పునసమీక్షిస్తోంది. ఒకవేళ రెగ్యులేటర్ కఠిన నిర్ణయం తీసుకుంటే ఇకపై మొబైల్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా డేటా వినియోగంలోనూ పారదర్శకత



# సహజత్వం కోసం పరిధులు దాటాను

పరిపూర్ణత, బహుముఖ ప్రజ్ఞ.. ఈ రెండూ అడివి శేష్‌కి అలంకారాలు. అందుకే ఆయన్నంతా పర్‌ఫెక్షనిస్ట్ అంటుంటారు. క్షణం, గూఢచారి, మేజర్, హిట్ 2.. ఈ చిత్రాల దర్శకులెవరైనా.. వీటి విజయాల వెనుక అడివి శేష్ పాత్ర మాత్రం కీలకం. 24క్రాఫ్ట్స్ లోని అన్ని విభాగాలపై అవగాహన ఉన్న అతికొద్దిమంది నటుల్లో అడివిశేష్ ఒకరు. రాశి కన్నా వాసి ముఖ్యమనే సిద్ధాంతాన్ని తూచ తప్పక పాటిస్తారాయన. అందుకే ఆయన సినిమాలు ఆలస్యమవుతూవుంటాయి. ఆయన హీరోగా, షానియల్ డియో దర్శకత్వంలో సుప్రియ యార్లగడ్డ నిర్మించిన 'డెకాయిట్' చిత్రం ఈ నెల 10న విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో అడివి శేష్ విలేకరులతో ముచ్చటించారు.ఒకరోజు నాకో ఆలోచన వచ్చింది. ఓ బిజీ రోడ్ పైన ఓ కాంక్రిట్ ఫుట్‌పాత్. దానికి ఉన్న చిన్న క్రాక్ నుంచి ఒక చిన్న పువ్వు బయటికి వస్తే? ఈ విజువల్ ఇమాజినేషన్ నుంచే 'డెకాయిట్' కథ పుట్టింది. ఓ తీవ్రమైన కోపం చుట్టూ అల్లుకున్న ప్రేమకథగా 'డెకాయిట్'ని తయారు చేశాం. ఇప్పటివరకూ నేను చేసిన యాక్షన్ సినిమాల్లో ఓ చిన్నభాగం ప్రేమకథను చూశారు. కానీ 'డెకాయిట్' అందుకు పూర్తి భిన్నం. ఇది కంప్లీట్ లవ్‌స్టోరీ. నా గత చిత్రాలను దృష్టిలో పెట్టుకొని, యాక్షన్ సినిమాలో లవ్ చూడటానికి ఈ సినిమాకు రావొద్దు. లవ్‌స్టోరీలో యాక్షన్ చూడటానికి రండి.. అంతా హ్యాపీగా ఫీలవుతారు. ఇందులో భావోద్వేగాలన్నీ సహజంగా ఉంటాయి. మృణాళ్ ఠాకూర్ అద్భుతమైన నటి. ఆమెతో నటించడం గొప్ప అనుభవం. అలాగే అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్ వంటి లెజెండ్స్ ఈ పానిండియా సినిమాకు పనిచేశారు. ఇందులో నేను పోషించిన హరి పాత్ర నా గత చిత్రాలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. తను ఏ విషయాన్నయినా మొహం మీదే మాట్లాడతాడు. ఆనందాన్నీ, ఆగ్రహాన్నీ దాచుకోడు. అందుకే ఈ పాత్ర కోసం సహజంగా నాలో ఉన్న లిమిటేషన్స్‌ని దాటాను. ఎప్పుడు లేనిది డ్యాన్సులు కూడా చేశాను. పాత్ర కోసమే మదనపల్లి యాస అలవాటు చేసుకున్నా. ఇక మ్యూజిక్ విషయానికొస్తే.. భీమ్స్ చాలా ఫ్రెష్ మ్యూజిక్ ఇచ్చారు. 'రుబారు' సాంగ్ రెహమాన్ పాటలా ఉందనే ప్రశంసలు వస్తున్నాయి. ఇక 'హలో బ్రదర్'లోని ఐకానిక్ సాంగ్ 'కన్నెపిట్టరో కన్నుగొట్టరో..' సరైన సందర్భంలో ఒకేసారి వస్తుంది. ఇదే ప్లేస్‌లో హిందీలో 'చీజ్ బడీ హే మస్తు మస్తు' సాంగ్ ఉంటుంది. పోలాకి విజయ్ అద్భుతమైన డ్యాన్స్ మూమెంట్స్ ఈ పాటకు హైలైట్. సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా ఆకట్టుకుంటంది.నేనెప్పుడూ బిజీగానే ఉంటాను. కానీ నా సినిమాలు లేట్ అవుతూవుంటాయి. నేను సినిమా చేసే తీరు అలా ఉంటుంది. వరుసగా సినిమాలు చేయాలంటే నాలో ఉన్న రచయితను పక్కన పెట్టాలి. ప్రస్తుతం 'గూఢచారి 2' షూటింగ్ జరుగుతున్నది. ఆ సినిమా తర్వాత వేరేవారి విజన్‌లో కూడా..

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?




మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# రెండు నెలల విశ్రాంతి


అగ్ర హీరో జూనియర్ ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు ప్రకటించారు. నిపుణులైన ప్రత్యేక ఆర్థోపెడిక్ వైద్య బృందం నేతృత్వంలో సర్జరీని నిర్వహించామని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు బుధవారం ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండుమూడు నెలల్లో ఆయన పూర్తిగా కోలుకుంటారని వైద్యులు తెలిపారు. సర్జరీ నుంచి త్వరగా కోలుకునేందుకు ఎన్టీఆర్‌కు ప్రత్యేక పునరావాస చికిత్సను చేపట్టనున్నారు. గత నెలలో జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు.






# కమల్‌హాసన్ కూడా చేయని పాత్ర

'నటులందరికీ కొలమానం కమల్‌హాసన్. ప్రపంచ సినీచరిత్రలో ఆయన చేసినన్ని వైవిధ్యమైన పాత్రలు ఎవరూ చేయలేదు.. చేయబోరు. అయితే.. 'గాయపడ్డ సింహం'లో నేను పోషించిన 'ధర్మ' తరహా పాత్ర ఆయనక్కూడా రాలేదు. ఆయన కూడా చేయలేదు. ఇది నాకు మాత్రమే దక్కిన అదృష్టం. ఈ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇది నా కెరీర్‌లోనే గుర్తుండిపోయే పాత్ర. కశ్యప్ తప్పకుండా ఇన్నోవేటివ్ డైరెక్టర్ అవుతాడు. పవన్ సాధినేని భుజాలపై ఈ సినిమాను మోశాడు. ఇది డైరెక్టర్స్ సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్‌భాస్కర్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'గాయపడ్డ సింహం'.జేడీ చక్రవర్తి కీలక పాత్ర పోషిస్తున్నారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకుడు. చక్రవర్తి మంతిన, భానుకిరణ్ ప్రతాప, విజయ్‌కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సాల్ నిర్మాతలు. పవన్ సాధినేని సమర్పకుడు. మే 1న సినిమా రిలీజ్ కానుంది. జేడీ చక్రవర్తి పోషిస్తున్న ధర్మ పాత్రను పరిచయం చేస్తూ రూపొందించిన గ్లింప్స్‌ని సోమవారం హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో జేడీ చక్రవర్తి మాట్లాడారు. ఇందులో జేడీ చక్రవర్తి మాఫియా డాన్‌గా నటిస్తున్నట్టు గ్లింప్స్ చెబుతున్నది. మాఫియా డాన్ ధర్మ చేసే ఆయుధాల అక్రమ రవాణా, డ్రగ్స్ తదితర యాక్టివిటీస్‌ని ఈ గ్లింప్స్‌లో చూడొచ్చు. జేడీ చక్రవర్తి స్క్రీన్‌ప్రెజెన్స్, 'బ్రూటల్ ధర్మ'గా ఆయన మేకోవర్ ఆకర్షణీయంగా ఉంది. ఇంకా ఈ కార్యక్రమంలో పవన్ సాదినేని, డైరెక్టర్ కశ్యప్, నిర్మాత భాను కిరణ్ ప్రతాప కూడా మాట్లాడారు.



# మా అంగీకారం తీసుకోవాల్సిందే!

ఎప్పుడూ ఏదో ఒక వ్యవహారంతో వార్తల్లో ఉండే తారాల్లో జాన్వీకపూర్ ఒకరు. నిజానికి సినిమాల కంటే సోషల్ మీడియా ద్వారానే ఎక్కువ వార్తల్లో నిలుస్తుంటుంది జాన్వీకపూర్. రీసెంట్‌గా ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ల ప్రవర్తనపై ఈ అందాలభామ ఇరిటేట్ అయ్యింది. తను ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నదో కూడా చూడకుండా, ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు ఫోటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయడంపై జాన్వీకపూర్ బాహాటంగానే భగ్గుమంది. 'అందంగా ఫొటోలు తీయడం ఓ కళ. అలాగే ఫొటోలకు ఫోజులివ్వడం కూడా కళే. అయితే దీనికి వేళాపాళా అవసరం. మేం సిద్ధంగా లేనప్పుడు, ఎలా పడితే అలా ఫొటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వల్ల.. నెటిజన్ల నుంచి విమర్శలు మేం ఎదుర్కోవలసి వస్తున్నది. 'హాట్‌గా లేదు.. అందంగా లేదు..' అంటూ వాళ్లు కామెంట్లు పెడుతుంటే, ఒక నటిగా నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించారా?. జిమ్‌కెళ్లినా, ఎయిర్‌పోర్ట్‌కెళ్లినా, ఏ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైనా ఈ పాపరాజీలు(ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్లు) మాత్రం మమ్మల్ని వదలడం లేదు. దయచేసి వారందరికీ నేను మనవి చేసేదొక్కటే. మా ఫొటోలు తీయండి. కానీ మా అంగీకారంతో తీయండి. మేం సిద్ధంగా లేనప్పుడు ఫొటోలు తీసి, మా అందానికి చెడ్డ పేరు తేవొద్దు.. ప్లీజ్' అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ.



# పూజా స్థానంలో మమితా?

ప్రేమలు, డ్యూడ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మలయాళీ సోయగం మమితా బైజు. ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ చిద్విలాసంగా కనిపించే ఈ సుందరికి యువతలో మంచి ఫాలోయింగ్ ఉంది. సూర్య నటిస్తున్న తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా నటిస్తున్నదీ అందాల భామ. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ సొగసరి మరో భారీ ఆఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. శర్వానంద్–శ్రీనువైట్ల కాంబోలో తెరకెక్కనున్న 'జార్జ్‌క్రిష్' అనే రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో మమితాబైజు కథానాయికగా ఖరారైందని సమాచారం. ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకు చోటుండగా.. ఇప్పటికే ఓ నాయికగా రుక్మిణి వసంత్‌ను ఖరారు చేశారు. రెండో కథానాయిక ఎంపిక కోసం పూజాహెగ్డేతో పాటు పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు మమితాబైజుని ఖరారు చేశారని తెలిసింది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com